

# సందేశహరుల సంపూర్ణ సత్య నిరూపణ



Author
Javed Ahmad Ghamidi

Translation
Mushtakh Ahmad Abhilash

ఈ లోకం మానవాళి పరీక్షార్థం నిర్మితమయ్యింది. పరీక్ష ఉందంటే శిక్షా-బహుమానాలు తప్పనిసరిగా ఉండాలి. దాని కోసం 'మహా ప్రళయదినం' (ఖయామతె కుబ్ర) నిర్ధారితమై ఉంది. భౌతిక విజ్ఞానశాస్త్ర విషయాలు ప్రయోగశాల (laboratory)లో నిరూపించి చూపినట్లే, రాబోయే ఆ అంతిమ శిక్షా-బహుమానాల పరిణామాన్ని కూడా సర్వేశ్వరుడైన అల్లాహ్ ఒక 'చిరు ప్రళయము' (ఖయామతె సుగ్ర)ను ముందస్తుగానే నిర్వహించి అనేకసార్లు చూపించాడు. దాని కోసం తాను కోరుకున్న ఒక జాతిలో సందేశహరుడిని (రసూల్) అల్లాహ్ నియమిస్తాడు. అతడు తన జాతి వారికి సత్య ధర్మాన్ని సవివరంగా ప్రబోధించిన కొంతకాలం తరువాత, ఆ ప్రజల మధ్య ఈ లోకంలోనే పూర్తి న్యాయంగా తీర్పు జరిగిపోతుంది. సత్యాన్ని అంగీకరించినవారు రక్షించబడతారు. సత్య తిరస్కారులపై దేవుని శిక్ష అవతరిస్తుంది. దీని పరిణామం రెండు విధాలుగా ఉండవచ్చు. అది వారిని ఈలోకం నుండి శాశ్వతంగా తుడిచివేయటం లేదా అవమానకరమైన పాలితులుగా ఉండే శిక్ష విధించటం. ఖురాను గ్రంథం పేర్కొనే నూహ్, ఆద్, సమూద్, లూత్ తదితర ఎన్నో జాతుల వృత్తాంతాలు అలాంటి చిరు ప్రళయానికి చెందిన సంఘటనలే!

ఈ విధమైన శిక్ష 'సంపూర్ణ సత్య నిరూపణ' (ఇత్మామె హుజ్జత్) పూర్తికానంత వరకూ ఏ జాతిపైనా అవతరించదన్నది ఖురాన్ తీర్మానం. దీనికి "ఒక సందేశహరుడిని నియమించనంతవరకూ మేము ఎవరినీ శిక్షించము" وَمَا كُنَّا مُعَذِّبِينَ حَتَّىٰ نَبْعَثَ رَسُولًا (17:15) అన్న అల్లాహ్ ప్రకటనే ప్రబల తార్కాణం. అయితే ఈ 'సంపూర్ణ సత్య నిరూపణ' పూర్తి కావటానికి షరతులు ఏమిటి? అనే ఒక ప్రశ్న తలెత్తవచ్చు... ఖురాన్ అధ్యయనంతో దానికి మూడు విషయాలు తప్పనిసరి షరతులుగా కనిపిస్తున్నాయి. వాటిలో...

మొదటి షరతు – ఒక సందేశహరుడు (రసూల్) ఒక జాతిలో నియుక్తుడై ఉండాలి. ఇంకా అతడు తన జాతి వారిని తనను విశ్వసించమని ఆహ్వానించాలి.

రెండవ షరతు – అతని జాతి వారికి తమ ప్రవక్తను కలసి, చూసి, అతని నోట దైవ సందేశాన్ని ప్రత్యక్షంగా వినే పూర్తి అవకాశం ఉండాలి.

మూడవ షరతు– సందేశహరునితో, అతని సహచరులతో 'దేవుని తోడు' (మాయియ్యతె ఇలాహి) ఉన్న విషయం వారి కళ్ళెదుట ఎంతగా నిరూపణ అవ్వాలంటే, ఆ విషయంలో మరొక అభిప్రాయం వ్యక్తపరచటానికి ఇక ఏ అవకాశమూ వారికి ఉండకూడాదు.

దీని తరువాత, దేవుని సమక్షంలో పెట్టటానికి ఎవరి కోసమూ ఏవిధమైన సాకు మిగిలి ఉండదు: 'لِءَلاَّ يَكُوْنَ لِلنَّاسِ عَلَى اللهِ حُجَّةٌ م بَعْدَ الرُّسُلِ' (4:165). ఇక, సాధ్యమైతే సత్యాన్ని అంగీకరించే వారికి లేక దైవదూతలకి సత్యతిరస్కారుల వీపులపై దైవ శిక్షా కొరడాను ఝుళిపించే ఆజ్ఞ అయ్యేది.

ప్రవక్త ముహమ్మద్ సర్వేశ్వరుడైన అల్లాహ్ ప్రవక్తల్లో చివరివారు. కనుక ఆయన కూడా దేవుని భూమిపై అంతిమంగా 'చిరు ప్రళయం' (ఖయామతె సుగ్ర) ప్రవేశ పెట్టటానికి నియుక్తులు అయ్యారు. కాబట్టి ఆయన తరపున 'సంపూర్ణ సత్య నిరూపణ' అయిన తరువాత ప్రవక్తకు, అయన అనుయాయులకు సత్యతిరస్కారులపై శిక్షను అమలుపరచే ఆజ్ఞ అయ్యింది.

**అరబ్బు బహుదైవోపాసకుల విషయంలో:**

మరి నిషిద్ధ మాసాలు గడచిపోగానే దైవేతరులను వేడుకొనే వారిని (ముష్రికీన్) ఎక్కడ కనబడితే అక్కడే చంపండి, వారిని నిర్బంధించండి, వారిని ముట్టడించండి. ప్రతి మాటు వద్ద వారి కొరకు పొంచి కూర్చోండి. ఒకవేళ వారు పశ్చాత్తాపం చెంది, నమాజును నెలకొల్పితే, జకాతును విధిగా చెల్లిస్తే వారి మార్గాన వారిని వదలిపెట్టండి. నిశ్చయంగా అల్లాహ్ క్షమించే వాడు, కనికరించేవాడు. –9:5

**గ్రంథ ప్రజల విషయంలో:**

అల్లాహ్‌నూ, అంతిమదినాన్నీ విశ్వసించని, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త నిషేధించిన వస్తువులను నిషిద్ధంగా భావించని, సత్యధర్మాన్ని అవలంబించని గ్రంథవహులతో – వారు పరాభవం పాలై తమ స్వహస్తాలతో జిజ్‌యా చెల్లించనంతవరకూ యుద్ధం చేయండి. –9:29

ఈ వాక్యాల సందర్భాన్ని బట్టి పై ఆజ్ఞ అరబ్బు ప్రాంతీయ బహుదైవోపాసకుల (ముష్రికీనె అరబ్) మరియు గ్రంథ ప్రజల (అహ్లెకితాబె అరబ్) కోసం మాత్రమే ప్రత్యేకమని సుస్పష్టమౌతుంది.

కానీ ప్రవక్త అనుయాయుల్లో అయన వారసులైన వారు కూడా అరబ్బు గ్రంథ ప్రజలతో అవలంబించిన విధానాన్నే అరేబియా వెలుపల ఉన్న కొన్ని జాతులతోనూ అవలంబించిన విషయం మనకి కనిపిస్తుంది. ఇది 'ధార్మిక అన్వయం' (ఇజ్తెహాద్)తో చేసిన ఒక నిర్ణయం అన్నది సుస్పష్టం. అలాంటి విషయాన్ని పొరపాటు నిర్ణయం అని చెప్పవచ్చు ఇంకా సరైన నిర్ణయం అని కూడా చెప్పవచ్చు. మేమైతే ప్రవక్త అనుయాయుల నిర్ణయాన్ని పూర్తిగా సరైనదని భావిస్తున్నాం. దానికి ఆధారం ఏమిటంటే, పైన ఏ షరతులైతే ప్రవక్తల తరఫున 'సంపూర్ణ సత్య నిరూపణ' (ఇత్మామె హుజ్జత్) కోసం తప్పనిసరని నిర్ధారించటం జరిగిందో అవన్నీ ఆ జాతుల విషయంలోనూ అన్ని విధాలా పూర్తైపోయాయి. వాటి వివరణ:

1. తన రాయబారుల ద్వారా తనను విశ్వసించటానికి ఆయా జాతుల వారిని ఆహ్వానించినప్పుడు ప్రవక్త ముహమ్మద్ ఈలోకంలోనే ఉన్నారు. ఆయన తన కాలం నాటి నాయకులను ఉద్దేశించి– "నేను దైవ సందేశహరుడను, నా తరఫున సందేశం అందుకున్న తరువాత మీ ఇహ–పరాల సాఫల్యానికి ఒకే ఒక దారి మిగిలి ఉంది. అదే ఇస్లాం" అనే విషయాన్ని అప్రమత్తం చేశారు.

ఇది దైవదౌత్య కాలం (జమానె రిసాలత్) నాటి చరిత్ర ఎరిగిన ప్రతి ఒక్కరికీ ఎరుకే. ఈ ఉత్తరాల్లో i) హబష్ చక్రవర్తి నజాషి, ii) ఈజిప్ట్ చక్రవర్తి ముకావ్కాస్, iii) పర్షియా చక్రవర్తి ఖుస్రావ్ పెర్వేజ్, iv) రోమ్ చక్రవర్తి ఖైసర్, v) బహ్రైయిన్ పాలకుడు ముంథర్ బిన్ సావి, vi) హుధా బిన్ అలీ సాహిబ్ యమమా, vii) హరిత్ బిన్ అబి డమాస్కస్ పాలకుడు మరియు viii) ఒమన్ చక్రవర్తి జెఫ్రీకి రాశారు. మేము రోము చక్రవర్తి ఖైసర్ పేరిట రాసిన ఒక ఉత్తరాన్ని ఇక్కడ పేర్కొంటున్నాం. దానిని ఏ విధానంలో, ఏ ఔన్నత్యంతో, ఏ ప్రకటనలతో రాశారో ఒక అంచనాకి రాగలరు.

దయాసాగరుడు, ప్రేమమయుడైన అల్లాహ్ పేరుతో...

సర్వేస్వరుడైన అల్లాహ్ దాసుడు మరియు సందేశహరుడైన ముహమ్మద్ తరఫున రోము దేశానికి చెందిన గొప్ప చక్రవర్తి అయిన ఖైసర్ పేరిట... దైవ మార్గదర్శకాన్ని అనుసరించేవారికే శాంతి కలుగుతుంది.

కనక నేను మీకు ఇస్లాం (అనగా దైవ విధేయతా జీవన విధానం) స్వీకరించాలని ఆహ్వానిస్తున్నాను. మీరు ముస్లిం (అంటే దైవ విధేయులు) అవ్వండి. శాంతి భద్రతలతో ఉండగలరు. ఒకవేళ వైముఖ్యం చూపితే మీ పాలితుల పాపం కూడా మీపైనే పడుతుంది.

ఓ గ్రంథ ప్రజలారా! మీకూ, మాకూ సమానమైన విషయం వైపునకు రండి. అదేమిటంటే సర్వేస్వరుడైన అల్లాహ్'ను తప్ప మరెవరినీ వేడుకో రాదు. ఇంకా, ఇతరులను ఆయనకి సమానులుగా చూడరాదు. అంతేకాదు, మనలో ఎవరూ మరొకరిని సర్వోన్నత ప్రభువులుగా చేసుకోరాదు. ఒకవేళ ఎవరైనా మీ ఈ సందేశానికి వైముఖ్యం చూపితే, మేమైతే ముస్లిములము (అనగా దైవ విధేయులము) దీనికి మీరు సాక్షులుగా ఉండండని ప్రకటించండి. –సహీహ్ బుఖారి

2. ఈ ఉత్తరాలు హుదైబియా నుండి వెనక్కి వచ్చిన తరువాత హిజ్రీ శకం, 7 వ సంవత్సరం ముహర్రం మాసంలో రాయటం జరిగింది. ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్ సుమారు నాలుగు సంవత్సరాలు జీవించి ఉన్నారు. రోమనుల తరఫు నుండి ఏదైనా దాడి జరగ వచ్చుననే ఆందోళనతో ఆయన తబూక్ ప్రయాణం కూడా చేశారు. ఆ కాల వ్యవధి తక్కువేమీకాదు. ఆ జాతులకి చెందిన ప్రజలు, ప్రముఖులు ఒకవేళ కోరితే వచ్చి ప్రవక్తను కలవగలిగేవారు. ఇంకా దేవుని భూమిపై దేవుని అంతిమ ప్రవక్తను తమ కళ్ళతో ప్రత్యక్షంగా చూడగలిగేవారు.

3. ప్రవక్తా మరియు ఆయన ప్రత్యక్ష అనుయాయులకి 'దేవుని తోడు' (మాయియతె ఇలాహి) ఉందనే విషయం బదర్, ఉహద్, అహజాబ్, మరియు ఖైబర్ ఆత్మరక్షణ సంగ్రామాల అత్భుత విజయాలతో అరబ్బు ప్రాంతానికి చెందిన దైవేతరుల ఆరాధకులకి, అక్కడి గ్రంథ ప్రజలకి సుస్పష్టంగా తెలిసిపోయింది. అయినప్పటికీ సత్యాన్ని తిరస్కరించారు. కనుక వారి కోసం 'దైవ శిక్షా ప్రకటన' వెలువడింది. ఖురాన్ ప్రకటించిన స్పష్టమైన భవిష్యవాణుల ప్రకారం– మక్కా ఖురైష్ వంశీయులు ఎంతో శక్తీ, కీర్తీ కలికి ఉన్నప్పటికీ పరాజితులైపోయారు.

వారి పూర్తి నాయకత్వం నాశనమై, మక్కా ముస్లిముల అధీనమైపోయింది. సర్వేశ్వరుడైన అల్లాహ్ 'ఆదిమ మందిరం' అయిన కాబా (మస్జిదె హరాం) నిర్వహణ వారి నుండి తొలగిపోయింది. అరబ్బు ప్రజలు తండోపతండాలుగా ఇస్లాం (దైవవిధేయతా జీవన విధానం)లో చేరిపోయారు. ధర్మానికి నిలకడ లభించింది. సర్వేశ్వరుడైన అల్లాహ్ శాసనం (షరీఅత్) అమలులో వచ్చేసింది. ఇక ఏ ఇతర మతాల అధికారమూ అరబ్బు ప్రపంచంలో మిగలి ఉండలేదు.

అంతేకాదు, ఆనాటి అదే 'దైవ శిక్షా ప్రకటన' అరబ్బు పరిసర జాతులన్నిటి కోసమూ అనువర్తనం అయిపోయింది. ఆ పరిసర జాతుల దుష్ట నాయకులపై చర్య తీసుకున్నప్పుడు వారి రాజ్యాలు కూడా ఇసుక తెన్నుల మాదిరిగా గాలిలో చెల్లాచెదురైపోయాయి. దీనితో సర్వేశ్వరుడైన అల్లాహ్ సందేశహరుని (రసూల్) తరపున 'సంపూర్ణ సత్య నిరూపణ' (ఇత్మామె హుజ్జత్) జరిగిపోయింది. కనక మీకు సుస్పష్టం అయిపోయిన ఈ సత్యాన్ని అంగీకరించకపోతే, ఇక మీ రాజ్యం దేవుని భూమిపై ఉండబోదు. మీకు పరాజయం తప్పదనే విషయాన్ని ఆ దేశాల రాజులకు ముందుగానే తెలపటం జరిగింది.

ఇవన్నీ ఆనాటి ప్రజల కళ్ళెదుట ప్రత్యక్షంగా సంభవించిన చారిత్రక వాస్తవాలు. వాటిని తిరస్కరించటానికి ఏ మాత్రం అవకాశం లేదు. ప్రవక్త ముహమ్మద్ అనంతరం గౌరవ సహచరులు ఏదైతే చేశారో, వాటి ఆధారంగానే చేసి ఉంటారు. ఇంకా వారు తమ సందేశంలో సైతం వాటి గురించి తప్పనిసరిగా శ్రద్ధ వహించే ఉంటారు. వారు వాటిని విస్మరించి, వ్యక్తికి లేక వర్గానికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టి ఉంటారని వారి విషయంలో అనుమానించటానికి ఏమాత్రం అవకాశం లేదు.